సాక్షి
మెదక్
శనివారం, 14, అక్టోబర్, 2023

I



పట్టుబిగిస్తున్న బీజేపీ
పటాన్‌చెరు నియోజకవర్గంలో బీజేపీ బలం క్రమంగా పెరుగుతోంది. అధికార పార్టీ బీఆర్ఎస్ బలంపై ప్రభావం చూపుతోంది.
వివరాలు IIలో ▸



ఓటరు బ్రహ్మాస్త్రం.. సీ-విజిల్
ఎలక్షన్‌లో అవినీతికి చెక్ పెట్టడానికి ఎన్నికల సంఘం సీ-విజిల్ యాప్ అందుబాటులోకి తీసుకొచ్చింది.
వివరాలు IIలో ▸



అల్పాహారం అదరహో..
మెదక్ బాలికల, చిన్నగొట్టిముక్ల పాఠశాలల్లో అందిస్తున్న అల్పాహారం అదరహో అనిపిస్తుంది.
వివరాలు IIIలో ▸

న్యూస్‌రీల్

పూటకో పార్టీలో శశిధర్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

పాపన్నపేట(మెదక్): మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి పార్టీ మారినంత మాత్రాన కాంగ్రెస్‌కు వచ్చే నష్టమేమి లేదని కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. శశిధర్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడ్డాడని ఆరోపించారు. 2014లో పాపన్నపేట మండల పరిషత్ ఎన్నికల్లో 15 ఎంపీటీసీ సీట్లకుగాను కాంగ్రెస్ 8 సీట్లు గెలిచిందన్నారు. అయితే శశిధర్‌రెడ్డి బీఆర్ఎస్‌కు కోవర్టుగా మారి నలుగురు ఎంపీటీసీలతో బయటి పార్టీ వారికి మద్దతు ఇప్పించాడన్నారు. అప్పుడే ఆయనను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశామన్నారు. పూటకో పార్టీ మారే నాయకుడికి ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గోవింద్, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, సేవాదల్ అధ్యక్షుడు నాగరాజు ఉన్నారు.

రెడ్డిపల్లి సర్పంచ్ సస్పెన్షన్ ఎత్తివేత



అల్లాదుర్గం(మెదక్): రెడ్డిపల్లి సర్పంచ్ నర్సమ్మపై అవినీతి ఆరోపణలు రావడంతో డీఎల్‌పీఓ నివేదిక ఆధారంగా గత నెల 27న కలెక్టర్ సస్పెన్షన్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీనిపై ఆమె హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ నర్సమ్మ తరపు న్యాయవాదుల వాదనలు విన్న తర్వాత సస్పెన్షన్ ఎత్తివేయాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. కోర్టు తీర్పు మేరకు నర్సమ్మను సర్పంచ్‌గా తిరిగి నియమిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. రాజకీయ కక్షలతోనే తనపై తప్పుడు ఫిర్యాదు చేశారని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యార్థులకు క్రీడలు కీలకం



మాట్లాడుతున్న నవీన్ నికోలస్

నర్సాపూర్: విద్యార్థుల జీవితాల్లో క్రీడలు కీలకమని రాష్ట్ర గిరిజన, సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి డాక్టర్ నవీన్ నికోలస్ చెప్పారు. శుక్రవారం నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామరాజు గిరిజన పాఠశాల, కాలేజీలో నిర్వహించిన ఏడో జోనల్ స్థాయి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను ఆయన ప్రారంభించారు. కాగా మూడు జిల్లాల నుంచి 566 మంది విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గిరిజన గురుకులం ఓఎస్‌డీ రంగారెడ్డి, కోఆర్డినేటర్ సంపత్‌కుమార్, ఎంఈఓ బుచ్చానాయక్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కల్యాణి, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఇన్‌చార్జి పీడీ సుజాత ఉన్నారు.

తనిఖీల్లో నగదు పట్టివేత

నర్సాపూర్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు కొనసాగిస్తున్నారు. శుక్రవారం వివిధ ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న నగదు స్వాధీనం చేసుకున్నారు. నర్సాపూర్ శివారులోని జాతీయ రహదారిపై ఎస్ఐ శివకుమార్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. నార్సింగి మండలం శంకాపూర్ గ్రామ పరిధి సిక్ తండాకు చెందిన కేమ్‌సింగ్ వాహనాన్ని ఆపి సోదా చేయగా రూ.2,34,300 పట్టుబడ్డాయి. ఆధారాలు లేకపోవడంతో డబ్బును సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తూప్రాన్: పట్టణంలో చేపట్టిన వాహన తనిఖీలో వంశీధర్‌రెడ్డి అనే వ్యక్తి వద్ద రూ.1,66,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తూప్రాన్ ఎస్ఐ శివానందం పేర్కొన్నారు. సత్య వైన్స్‌కు సంబంధించిన ఈ డబ్బును సరైన పత్రాలు లేకుండా తీసుకెళ్తుండడంతో సీజ్ చేశామని చెప్పారు.

మనోహరబాద్(తూప్రాన్): మండల పరిధిలోని కాళ్లకల్ వద్ద బైక్‌పై అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. వారిని తనిఖీ చేయగా ఖదీర్ అనే వ్యక్తి వద్ద లక్షరూపాయలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సరైన ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

రామాయంపేట(మెదక్): మండల పరిధి అక్కన్నపేట వద్ద ఝాన్సీలింగాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి సౌందర్య రూ.90 వేలు నగదును తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. సరైన పత్రాలు లేకపోవడంతో డబ్బును సీజ్ చేసినట్లు ఎస్ఐ రంజిత్ తెలిపారు.

మహిళా ఓటర్లే అధికం



- నర్సాపూర్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,20,847
- మహిళా ఓటర్లు 1,12,965
- పురుష ఓటర్లు, 1,07,875
- 5,090మంది మహిళా ఓటర్లు ఎక్కువ


నర్సాపూర్: నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఈ నెల 4వ తేదీన ఓటర్ల తుది జాబితా ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. ఈ జాబితాలో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఓటర్ నమోదు చేసుకున్నారు. అధికారులు ఓటర్ నమోదుపై విస్తృతంగా అవగాహన కల్పించడంతో మహిళలు ఎక్కువగా ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటముల్లో వీరి ఓటే కీలకం కానుంది. దీంతో మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు రాజకీయ పార్టీలు కసరత్తు మొదలుపెట్టాయి. నర్సాపూర్ నియోజకవర్గంలో ఎనిమిది మండలాలతో పాటు మనోహరబాద్ మండలంలోని నాలుగు గ్రామ పంచాయతీలు ఉన్నాయి. నర్సాపూర్, వెల్దుర్తి, మాసాయిపేట, శివ్వంపేట, కొడిపల్లి, కౌల్దారం, చిలిపిచెడ్, హత్నూర మండలాలతో పాటు మనోహరబాద్ మండలంలోని పర్కిబండ, పోతారం, తుపాకులపల్లి, గౌతోజిగూడ గ్రామ పంచాయతీలు నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. కాగా హత్నూర మండలం సంగారెడ్డి జిల్లా పరిధిలోకి వెళ్లింది. ప్రస్తుతం అసెంబ్లీ నియోజకవర్గంలో 2,20,847 మంది ఓటర్లు ఉండగా, ఇందులో 1,12,965 మంది మహిళా ఓటర్లు, 1,07,875 మంది పురుష ఓటర్లు, ఇతరులు ఏడుగురు ఉన్నారు. కాగా పురుషుల కంటే 5,090మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. కాగా 2018 సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో 2,11,597మంది ఓటర్లు ఉండేవారు. ప్రస్తుతం 9,250మంది ఓటర్లు పెరిగారు. నియోజకవర్గంలో 305 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు.

యువ ఓటర్లు

నియోజకవర్గ పరిధిలో కొత్తగా 7,839 మంది యువతీ యువకులు ఓటు హక్కు పొందారు. 18, 19 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోగా ఎన్నికల కమిషన్ వారికి ఓటు హక్కు కల్పించింది.

ఓటర్ల వివరాలు

నియోజకవర్గంలో ఆయా విభాగాల వారీగా ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి. 18 నుంచి 19ఏళ్ల మధ్య వయస్సు వారిలో 4515 మంది పురుష ఓటర్లు, 3324మంది మహిళా ఓటర్లతో కలిపి మొత్తం 7839 ఓటర్లు ఉన్నారు. 20నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సు విభాగంలో 26,366 మంది పురుష ఓటర్లు, 23,572 మంది మహిళా ఓటర్లు, ఇతరులు నలుగురితో కలిపి మొత్తం 49942మంది ఓటర్లు ఉన్నారు. కాగా, 30నుంచి 39 ఏళ్ల మధ్య వయస్సు వారిలో 30035 మంది పురుష ఓటర్లు, 31,096 మంది మహిళా ఓటర్లు, ఇతరులు ఒకరితో కలిపి 61,132 మంది ఓటర్లు ఉన్నారు. కాగా 40నుంచి 49 ఏళ్ల మధ్య వయస్సు విభాగంలో 22,443మంది పురుష ఓటర్లు, 24,943మంది మహిళా ఓటర్లు, ఇద్దరు ఇతర ఓటర్లతో కలిపి 47,388 మంది ఓటర్లు ఉన్నారు. కాగా 50 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సు ఓటర్లలో 13,179 మంది పురుష ఓటర్లు, 15,256 మంది మహిళా ఓటర్లతో కలిపి 28,435మంది ఓటర్లు ఉన్నారు. 60 నుంచి 69మధ్య వయస్సు విభాగంలో 7702మంది పురుష ఓటర్లు, 9366మంది మహిళా ఓటర్లతో కలిపి 17,068మంది ఓటర్లు ఉన్నారు. కాగా 70నుంచి 79 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారిలో 3072మంది పురుష ఓటర్లు, 4254 మంది మహిళా ఓటర్లతో కలిపి మొత్తం 7326 మంది ఓటర్లు ఉన్నారు. కాగా 80 నుంచి 89 ఏళ్ల మధ్య వయస్సు విభాగంలో 1507మంది ఓటర్లు ఉండగా వారిలో 503మంది పురుష ఓటర్లు, 1004మంది మహిళా ఓటర్లు ఉన్నారు. కాగా 90నుంచి 99 ఏళ్ల వయస్సు ఉన్నవారిలో 53మంది పురుష ఓటర్లు, 141మంది మహిళ ఓటర్లతో కలిపి మొత్తం 194మంది ఉన్నారు. వంద నుంచి 109 ఏళ్ల మధ్య వయస్సు విభాగంలో పది మంది ఓటర్లు ఉండగా నలుగురు పురుషులు, ఆరుగురు మహిళా ఓటర్లు ఉన్నారు. కాగా 120 ఏళ్ల వయస్సు దాటిన ఓటర్ల విభాగంలో ఆరుగురు ఓటర్లు ఉన్నారు. ఇందులో ముగ్గురు పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నారు.



డబ్బులతో ఆత్మగౌరవం కొనలేరు



మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డిని బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు

ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు

పాపన్నపేట(మెదక్): కొందరు డబ్బుల సంచులతో ఓట్ల కోసం వస్తున్నారని, కానీ మెదక్ ప్రజల ఆత్మ గౌరవాన్ని మాత్రం వారు కొనలేరని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని యూసుఫ్‌పేటలో మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ మెదక్‌లో పద్మమ్మ గెలిచి హ్యాట్రిక్ సాధించడం తథ్యమన్నారు. దండగా అన్న వ్యవసాయాన్ని పండగలా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న వినూత్న పథకాలను ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో కరువులు, కర్ఫ్యూలు సాధారణమన్నారు. కాళేశ్వరం నీళ్లు వస్తే ఘనపురం నీటికి కొదవ ఉండదన్నారు. శశిధర్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడంతో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. పాతికేళ్లుగా కాంగ్రెస్‌కు సేవ చేస్తున్నా పార్టీలో తనకు తీరని అన్యాయం జరిగిందన్నారు. కష్టపడిన వారికి కాకుండా మధ్యలో వచ్చిన వారికి టిక్కెట్లు ఇవ్వడం కాంగ్రెస్ పార్టీ నైజమన్నారు. అదేవిధంగా వెంకోబ, ప్రభుభూషణ్, ఏసురెడ్డి, లచ్చిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పంతు కిషన్, భాను, వెంకటి, సాయిలు, భుజంగరెడ్డి, లక్ష్మణ్ నాయక్, సత్యనారాయణరెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు.

ఆత్మగౌరవానికి, నోట్ల కట్టలకు పోటీ

మెదక్: మెదక్‌లో ఆత్మగౌరవానికి, నోట్ల కట్టల మధ్య పోటీ జరుగుతుందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో పీసీసీ సభ్యుడు మామిళ్ల ఆంజనేయులు మంత్రి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. అనంతరం హరీశ్ మాట్లాడారు. సీఎం కేసీఆర్ కృషితో మెదక్ జిల్లా అన్నివిధాలుగా అభివృద్ధి చెందిందని తెలిపారు. ఇక్కడి నుంచి కార్యాలయాలు తరలిపోతున్నాయంటూ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. మూడు మండలాల రామాయంపేటను సైతం రెవెన్యూ డివిజన్ చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. ఘనాపూర్ ప్రాజెక్టు ఎత్తుపెంపు కోసం రూ.70 కోట్లు మంజూరయ్యాయని, నేడు చివరాయకట్టు వరకు నీరు అందుతుందని మంత్రి పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ హన్మంతరెడ్డి, జెడ్పీ వైస్‌చైర్మన్ లావణ్యరెడ్డి, అల్లాదుర్గ్ జెడ్పీటీసీ కాశీనాథ్, అనంతరెడ్డి, పార్టీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా రైతు కమిటీ అధ్యక్షుడు సోములు, మండల కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ దాసు, ఎంపీటీసీ విజయ సాయిలు, దత్తుసేట్, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.



పీసీసీ సభ్యుడు ఆంజనేయులుకు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి

ఆధారాలు లేకుంటే నగదు సీజ్

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా డబ్బు తరలిస్తే సీజ్ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల గ్రీవెన్స్‌సెల్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. లక్ష నుంచి పది లక్షల రూపాయల నగదు తరలిస్తే ఇన్‌కంటాక్స్ అధికారులకు సమాచారం అందించాలని అధికారులకు సూచించారు. పట్టుబడిన నగదుకు సరైన పత్రాలను ఎన్నికల గ్రీవెన్స్ విభాగంలో సమర్పించి, తిరిగి దానిని పొందవచ్చని తెలిపారు. ఎన్నికలపై సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన్ నంబర్ 1950కు కాల్ చేయాలని చెప్పారు. అలాగే ఎన్నికల గ్రీవెన్స్ టీం పీడీడీఆర్డీఏ శ్రీనివాస్(9281484100), జిల్లా అడిట్ అధికారి జి.రమేష్(9948213828), జిల్లా ట్రెజరీ అధికారి చిన్న సాయిలు(7799934150) ఫోన్ నంబర్లలో కూడా సంప్రదించవచ్చు.



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల గ్రీవెన్స్‌సెల్

రక్త నిల్వలకు శిబిరాలు ఏర్పాటు చేయాలి

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో రక్త నిల్వలు పెంచేందుకు శిబిరాలు ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. దీనిని డీఈఓ రాధాకిషన్, డీఎస్‌ఓ బ్రహ్మరావులతో కలిసి ఆయన సందర్శించారు. జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డితోపాటు ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నవీన్, సుదర్శనమూర్తి పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, డీఈఓ

నీలంకు గాలం

- పార్టీలో చేర్చుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ యత్నాలు
- అభ్యర్థిత్వం అంశాన్ని పరిశీలిస్తామంటూ కమలం పార్టీ ఆఫర్?
- పాదయాత్రకు సిద్ధమవుతున్న మధు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : బీఆర్ఎస్ టికెట్ ఆశించి భంగపడిన నీలం మధుకు ప్రతిపక్ష పార్టీలు గాలం వేస్తున్నాయి. పటాన్‌చెరు నియోజకవర్గంలో గట్టి పట్టున్న మధును పార్టీలో చేర్చుకునేందుకు కాంగ్రెస్, బీజేపీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన అతనికి స్థానికంగా యువతలో మంచి క్రేజ్ ఉంది. అలాగే బీసీ సామాజికవర్గాల్లోనూ మద్దతు ఉంది. స్థానికంగా బలం, బలగం రెండూ ఉన్న మధును పార్టీలో చేర్చుకుంటే ఎన్నికల్లో లబ్ధి చేకూరుతుందని భావిస్తున్నాయి. జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ముదిరాజ్ సామాజికవర్గం ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. కొన్ని చోట్ల గెలుపోటములను ప్రభావితం చేసేంత సంఖ్యలో వారు ఉన్నారు. మరోవైపు బీఆర్ఎస్ టికెట్ కేటాయించాలంటూ ముదిరాజ్‌లు జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అతడిని పార్టీలో చేర్చుకోవడం ద్వారా ఆ సామాజిక వర్గాల మద్దతును కొంత మేరకు కూడగట్టుకోవచ్చనే భావన ప్రతిపక్ష పార్టీల్లో ఉంది.

అభ్యర్థిత్వం పరిశీలిస్తామని ఆఫర్

బీఆర్ఎస్ పటాన్‌చెరులో సిట్టింగ్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి అభ్యర్థిత్వం ఖరారైంది. అంగ, ఆర్థిక బలంతోపాటు నియోజకవర్గంలో గట్టి పట్టున్న ఆయనను ఢీకొనగల సత్తా ఉన్న నాయకులను బరిలో దించాలని బీజేపీ భావిస్తోంది. మధును బరిలోకి దించితే బీఆర్ఎస్‌కు గట్టి పోటీ ఇవ్వగలరని, జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో ఉన్న పార్టీ అభ్యర్థులకు కూడా చాలా వరకు మేలు జరుగుతుందనే భావనతో బీజేపీ నాయకత్వం ఉన్నట్లు రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. దీంతో ఆయన చేరితే అభ్యర్థిత్వం విషయంలో పేరును పరిశీలిస్తామనే ప్రతిపాదన వచ్చిందని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్ర స్థాయిలో చేరికల కమిటీ బాధ్యతలు చూస్తున్న ఈటల రాజేందర్ కూడా మధు చేరిక విషయంలో పార్టీ జిల్లా నాయకత్వానికి పరోక్షంగా సంకేతాలిచ్చినట్లు చర్చ జరుగుతోంది.

పాదయాత్రకు సిద్ధమవుతున్న నీలం

టికెట్ దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసిన నీలం మధును గులాబీ పార్టీ బుజ్జగించే ప్రయత్నం చేసింది. మంత్రి హరీశ్‌రావు స్వయంగా ఫోన్‌చేసి మాట్లాడారు. ఆయన సేవలు పార్టీకి అవసరమని, తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ఎన్నికల్లో పోటీ చేస్తానని ఆయన ప్రకటించారు. ఈనెల 16 వరకు వేచి చూస్తానని, అప్పటికీ తనకు టికెట్ ప్రకటించని పక్షంలో బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తానని ప్రకటించారు. అలాగే ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు పటాన్‌చెరు నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తానని ప్రకటించారు. ప్రతి గడపకూ వెళ్లి సబ్బండవర్గాల ప్రజలను కలుస్తానని, వచ్చే ఎన్నికల్లో తనకు ఓటు వేయాలని అభ్యర్థిస్తానని తేల్చిచెప్పారు. ఇలా అధికార పార్టీ తిరుగుబాటు బావుటా ఎగురవేసిన ఆయనను పార్టీలో చేర్చుకునేందుకు బీజేపీ, కాంగ్రెస్ ప్రయత్నించడం రాజకీయవర్గాల్లో ఆసక్తికరంగా మారింది.



ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపకుడు నీలం మధు

మీ బిడ్డగా ఆశీర్వదించండి

పటాన్‌చెరు టౌన్/ రామచంద్రాపురం (పటాన్‌చెరు): మీ బిడ్డగా ఎమ్మెల్యే బరిలో ఉంటున్నానని, ప్రజల సమస్యలే ఎజెండాగా ముందుకు సాగుతానని, సబ్బండ వర్గాల ఆత్మగౌరవమే ప్రధాన ఎజెండా అని ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం రాత్రి తన స్వగ్రామమైన చిట్కుల్‌లో పలు కాలనీల్లో ఉన్న ప్రజలతో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేశారు. గ్రామంతోపాటు పటాన్‌చెరు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల 16 నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టబోయే పాదయాత్రకు అందరి ఆశీస్సులను కోరారు.

సమస్యాత్మక కేంద్రాల్లో పటిష్ట భద్రత

ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

పెద్దశంకరంపేట/ టేక్మాల్(మెదక్): జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ రోహిణి ప్రియదర్శిని తెలిపారు. శుక్రవారం పెద్దశంకరంపేటలోని పోలింగ్ కేంద్రం, కోళాపల్లి 161వ జాతీయ రహదారిపై పాత టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టు, టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఎస్పీ పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రజలు రూ.50వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లవద్దని సూచించారు. అంతకంటే ఎక్కువ తీసుకెళ్లాలంటే తప్పనిసరి ధ్రువపత్రాలు ఉండాలని పేర్కొన్నారు. ఏదైనా సమస్య ఉంటే 1950 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే లైవ్ లోకేషన్‌లో సీ–విజిల్ యాప్‌లో ఫొటోలు, వీడియోలు, వాయిస్ మెసేజీలు అప్‌లోడ్ చేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, వాహనాల నంబర్లను కచ్చితంగా నోట్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.



కోళాపల్లి టోల్‌ప్లాజా వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ

పోలింగ్ కేంద్రాల పరిశీలన

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని అల్లాదుర్గం బాలుర ప్రాథమిక పాఠశాల, రెడ్డిపల్లి పోలింగ్ కేంద్రాలను ఎస్పీ పరిశీలించారు. అల్లాదుర్గం సీఐ జార్జ్, పేట ఎస్ఐ బాలరాజు, ప్రవీణ్‌రెడ్డి, ఏఎస్ఐ రాజయ్య ఉన్నారు.

ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలు

మెదక్ మున్సిపాలిటీ: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని (ఫ్లాగ్ డే) పురస్కరించుకుని జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్పీ రోహిణి ప్రియదర్శిని తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మెదక్ జిల్లా పరిధిలోని విద్యార్థులకు, యువతకు ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లకు ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలింకు సంబంధించి పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వివరాల కోసం 9640474336లో సంప్రదించాలని తెలిపారు.

బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మరు

వట్‌పల్లి(అందోల్): కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అధికారంలోకి రాగానే అమలు చేస్తామని సీడబ్ల్యూసీ శాశ్వత సభ్యుడు దామోదర రాజనర్సింహ అన్నారు. శుక్రవారం మాజీ జెడ్పీటీసీ జానయ్యతోపాటు మండలం పరిధిలోని భూత్కూర్, గట్‌పల్లి, దేవునూర్, పాలడుగు గ్రామాల్లోని నేతలు పెద్దఎత్తున పార్టీలో చేరారు. పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తుందని, అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇప్పటివరకు నెరవేర్చలేదని విమర్శించారు. పథకాల పేరిట పత్రాలను ప్రజల చేతుల్లో పెట్టి సీఎం కేసీఆర్ మాయ చేస్తున్నాడని మండిపడ్డారు. వారి పాలనకు ప్రజలు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, దళితులకు భూపంపిణీ, రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. నియోజకవర్గంలో తమ హయాంలో జరిగిన అభివృద్ధి పనులే నేటికీ దర్శనమిస్తున్నాయన్నారు. అంతకుముందు దర్గాలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మాజీ స్కోర్(విద్యుత్) చైర్మన్ పి.సంగమేశ్వర్, పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్‌జోష్‌, మాజీ జెడ్పీటీసీ రాంరెడ్డి, సర్పంచ్ రమేశ్, మాజీ సర్పంచ్ శివచరణ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్‌గౌడ్, యువజన విభాగం మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్‌పాటిల్, అరవింద్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దామోదర రాజనర్సింహ

క్లుప్తంగా

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ

కమాండెంట్ కల్నల్ సునీల్ అబ్రహం



మాట్లాడుతున్న క్యాంప్ కమాండెంట్ కల్నల్ సునీల్ అబ్రహం

గజ్వేల్‌రూరల్: క్రమశిక్షణకు మారుపేరుగా ఎన్‌సీసీ నిలుస్తుందని క్యాంప్ కమాండెంట్ కల్నల్ సునీల్ అబ్రహం అన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్ ప్రారంభోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 12 రోజుల పాటు జరగనున్న ఈ శిక్షణలో భాగంగా హైద్రాబాద్‌లోని ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్, శిల్పారామం, మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, గోల్కొండ ఆర్టీ సెంటర్, రామోజీ ఫిల్మ్ సిటీ, హకీంపేటలోని ఏఎఫ్ స్టేషన్‌లు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో క్యాంప్ డిప్యూటీ కమాండెంట్ కల్నల్ పీఎస్ నందాతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 300 మంది కేడెట్లు, 15 మంది ఎన్‌సీసీ అధికారులు, 10 మంది పీఐ స్టాఫ్ పాల్గొన్నట్టు లెఫ్టినెంట్ డాక్టర్ భవాని, లెఫ్టినెంట్ డాక్టర్ మనోజ్ తెలిపారు.

'ఆడపిల్ల పుడితే ఊరంతా పండగ'



తల్లులను సన్మానిస్తున్న మహిళలు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం చందాపూర్ గ్రామ సంఘం ఆధ్వర్యంలో ఆడపిల్ల పుడితే ఊరంతా పండుగ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముగ్గురు ఆడపిల్లల తల్లులకు నూతన వస్త్రాలు ఇచ్చి మహిళా సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఆడపిల్ల పుడితే మహాలక్ష్మిగా భావించి ఊరంతా పండగ చేసుకోవాలన్నారు. సుకన్య యోజన పథకం కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, గ్రామ సంఘం నాయకులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాల పెంపు లక్ష్యంగా..

ఎమ్మెల్సీ రఘోత్తమ్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘోత్తమ్ రెడ్డి

సిద్దిపేటజోన్: ప్రభుత్వ విద్య వ్యవస్థను బలోపేతం చేస్తూ ఉపాధ్యాయుల జీవన ప్రమాణాలు పెంపు లక్ష్యంగా పీఆర్టీయూ పనిచేస్తోందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తమ్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కొండభూదేవి గార్డెన్‌లో జరిగిన సర్వ సభ్య సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు, కేసులు పెట్టినా, బదిలీలు పదోన్నతులకు కృషి చేయాలని సూచించారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా పదోన్నతులు, బదిలీలు పూర్తి చేయిస్తామని, త్వరలో అన్ని కార్పొరేటఆసుపత్రిల్లో ఉద్యోగులకు ఉచిత వైద్యం అందుతుందని చెప్పారు. దానికి సంబంధించి హెల్త్ కార్డ్ జీఓ జారీ అయిందని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కేశవరెడ్డి వెంకటరాజు, శశిధర్, ఇంద్రసేనారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, అస లక్ష్మణ్, మాధవి, బొందెయ్య, సుజాత, శ్రీనివాస్, పద్మ, రమాదేవి, విజయ పాల్గొన్నారు.

ఓటరు బ్రహ్మాస్త్రం.. సీ-విజిల్

- ఎన్నికల సంఘం రూపొందించిన యాప్
- నిమిషాల్లో రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు
- అక్రమాల అడ్డుకట్టకు దోహదం



మెదక్: ఎన్నికల్లో అవినీతికి చెక్ పెట్టడానికి ఎన్నికల సంఘం ఓటర్లకు ఒక బ్రహ్మాస్త్రాన్ని సిద్ధం చేసింది. అదే సీ-విజిల్ యాప్. ఇది ఎన్నికల్లో జరిగే అక్రమాలను అడ్డుకట్ట వేసే బ్రహ్మాస్త్రంగా చెబుతున్నారు. అభ్యర్థులు డబ్బు, మద్యం, ఇతర వస్తువులను ఓటర్లకు ఎరగా చూపి అడ్డదారిలో గెలుపొందేందుకు ప్రయత్నిస్తుంటారు. అలాంటి అవినీతి నాయకుల అంతు చూసేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది.

ఇలా పనిచేస్తుంది..

నాయకులు ఓటర్లకు డబ్బు, మద్యం లేదా ఇతర వస్తువు రూపంలో ఇచ్చే క్రమంలో ఫొటోలు, వీడియోలు తీసి ఘటనా స్థలం నుంచి సీ-విజిల్ యాప్‌లో అప్‌లోడ్‌చేయాలి. వెంటనే ఆ దృశ్యాలు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కి చేరతాయి. వెంటనే అధికారులు అప్రమత్తమై అక్కడి చేరుకుంటారు. ఆయా నాయకులపై చర్యలు తీసుకుంటారు. ఈ యాప్ ద్వారా అందే సమాచారం బలమైన సాక్ష్యంగా పనిచేస్తుంది. అవసరమైతే ఆయా అభ్యర్థుల సభ్యత్వాన్ని రద్దు చేసినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదు. ఫొటోలు, లేదా వీడియోలు పంపిన వెంటనే ఫిర్యాదు దారులు ఏ లోకేషన్ నుంచి వాటిని పంపారనేది అధికారులకు స్పష్టంగా తెలుస్తుంది. దీంతో వెంటనే చర్యలు తీసుకునేందుకు వీలుంటుంది. ఎన్నికల సంఘం నియామవళి ప్రకారం ఫిర్యాదు దారుల వివరాలను గోప్యంగా ఉంచుతారు.

పోలీస్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం

ఈ సీ-విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులు, సమాచారం ఎన్నికల అధికారులతో పాటు నేరుగా పోలీస్ కంట్రోల్ రూంకు కూడా అందుతుంది. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, సర్వైలెన్స్ కమిటీలు, రిజర్వ్ టీములు అప్రమత్తం అవుతాయి. వెంటనే లోకేషన్‌కు వెళ్లి బాధ్యులపై చర్యలు తీసుకుంటారు. అంతేకాదు అవినీతికి పాల్పడిన అభ్యర్థులపై ఏ విధమైన చర్యలు తీసుకున్నారనే సమాచారాన్ని సైతం ఫిర్యాదు చేసిన వారికి 100 నిమిషాల్లో యాప్‌ద్వారా తెలియజేస్తారు.

తప్పుడు సమాచారం స్వీకరించదు

ఈ సీ-విజిల్ యాప్‌ను తప్పుదోవ పట్టించే వీలులేదు. ఈ యాప్‌ను ఘటన జరిగిన స్థలం నుంచే వినియోగించాలి. మరో చోటుకు వెళ్లి తీసిన ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేయడం సాధ్యం కాదు. అలాగే పాత ఫొటోలతో ఎదుటి వారిపై పిర్యాదు చేసినా తీసుకోదు.

నిజాయితీ పరులకు నేస్తం

సభలు, సమావేశాల్లో ఎవరైనా కోడ్‌ను ఉల్లంఘించే విధంగా ప్రసంగించినా, ఏ అక్రమాలకు పాల్పడినా వెంటనే రికార్డు చేసి అన్యాయాన్ని అడ్డుకోడానికి సీ- విజిల్ యాప్ ఎంతో ఉపయోగపడుతుంది. ఈ యాప్‌ను ఎన్నికల సంఘం 2018లోనే అందుబాటులోకి తెచ్చింది.

మా ప్రశ్నలకు జవాబు చెప్పండి

- గౌరవెల్లి, గండిపెల్లి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదు
- సీఎంకు సీపీఐ నేత చాడ వెంకట్ రెడ్డి ప్రశ్న



హుస్నాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ హుస్నాబాద్ ప్రజాఆశీర్వాద సభలో తమ ప్రశ్నలకు జవాబు చెప్పాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. పదేళ్ల గడిచినా గౌరవెల్లి, గండిపెల్లి ప్రాజెక్టులను పూర్తి చేయలేదని మాట్లాడటానికి వస్తున్నారా.. లేదా భూ నిర్వాసితులను పోలీసులచే భయభ్రాంతులకు గురిచేసి ఇళ్లు ఖాళీ చేసినందుకు వస్తున్నారా..? పరిహారం అడిగితే పోలీసులచే లాఠీచార్జీ చేయించి, రైతుల చేతులకు సంకెళ్లు వేశానని మాట్లాడేందుకు వస్తున్నారా అని ప్రశ్నించారు. కుర్చీ వేసుకొని ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. గౌరవెల్లి ప్రాజెక్టు విషయంలో గ్రీన్ ట్రిబ్యునల్ ప్రభుత్వాన్ని తప్పు పట్టిందన్నారు. పనులు జరగకుండా సీసీ కెమెరాలు పెట్టే పరిస్థితికి తెచ్చారని మండిపడ్డారు. భూ నిర్వాసితులు చెట్టుకొకరు, పుట్టకొకరు ఊరు విడిచి వెళ్లిపోయినా పూర్తి స్థాయిలో పరిహారం అందించలేదని పేర్కొన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును తామే కట్టామని, 1.60 లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తున్నామని , సతీశ్‌కుమార్‌ను లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలని మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారని, అసలు పోరాటాలు చేసిందే సీపీఐ పార్టీ అన్నారు. కెనాల్స్ తెగిపోయాయని కేసీఆర్‌కు ఎన్ని లేఖలు రాసినా జవాబు లేదన్నారు. మంత్రి హరీశ్‌రావు హుస్నాబాద్‌కు 100 పడకల ఆస్పత్రిని ఎందుకు తేలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ భూముల్లో పేదలకు నివేశన స్థలాల పట్టాలిచ్చినా ఒక్క ఇల్లు కట్టలేదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ తదితరులు ఉన్నారు.

పొత్తు ఓకే.. సీట్లు తేలాల్సి ఉంది

కాంగ్రెస్, సీపీఐ మధ్య పొత్తులు కుదిరిందని, అయితే సీట్ల విషయం తేల్చాల్సి ఉందని చాడ అన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ ఓటమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. పొత్తులో భాగంగా హుస్నాబాద్ టికెట్ సీపీఐకి వచ్చినా కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని, కాంగ్రెస్‌కు టికెట్ వచ్చినా తాము మద్దతు తెలుపుతామని స్పష్టం చేశారు.

పథకాలు బీఆర్ఎస్ కార్యకర్తలకేనా..

కోహెడ(హుస్నాబాద్): ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులకే అందిస్తారా.. అని సీపీఐ జాతీయ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి నిలదీశారు. సీపీఐ మండల సమితి ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ తళ్లపల్లి ఎల్లయ్య, శంకర్ తదితరులు ఉన్నారు.

జంగ్ తెలంగాణ

పట్టుబిగిస్తున్న బీజేపీ

- పటాన్‌చెరులో క్రమంగా పెరుగుతున్న బలం
- టికెట్ కోసం 11 మంది ఆశావహులు



నందీశ్వర్‌గౌడ్



శ్రీకాంత్‌గౌడ్



ఎడ్ల రమేష్



అంజిరెడ్డి

పటాన్‌చెరు: నియోజకవర్గంలో బీజేపీ బలం క్రమంగా పెరుగుతోంది. అధికార పార్టీ బీఆర్ఎస్ బలంపై ప్రభావం చూపుతోంది. మైనార్టీలు కాంగ్రెస్ వైపునకు మొగ్గు చూపితే ఇక్కడ అధికార పార్టీకి నష్టమే. పటాన్‌చెరు నియోజకవర్గం సంగారెడ్డి నియోజకవర్గంలో అంతర్భాగంగా ఉన్న కాలంలో బీజేపీ, టీడీపీ పొత్తులో బీజేపీకి 70,522 ఓట్లు వచ్చాయి. పటాన్‌చెరుకు చెందిన కుర్ర సత్యనారాయణ పోటీ చేసి నందీశ్వర్‌గౌడ్‌పై గెలుపొందారు. నియోజకవర్గంలో బీజేపీకి బలం పెరగడంతోనే ఆ విజయం సాధ్యపడిందనే విశ్లేషణలు ఉన్నాయి. అయితే పటాన్‌చెరు ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పడినప్పటి నుంచి కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోటీ పెరిగింది. తాజా పరిస్థితులను గమనిస్తే పటాన్‌చెరులో గ్రామీణ ఓటర్ల ప్రభావం తక్కువే. పటాన్‌చెరు, అమీన్‌పూర్, బొల్లారం, తెల్లాపూర్ ప్రాంతాల్లో చాలా కొత్త కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు వెలిశాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి స్థిరనివాసం ఏర్పాటు చేసుకుంటున్నారు. సైబర్‌సిటీకి దగ్గర కావడంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఆ కాలనీల్లో ఉంటున్నారు. వారు జాతీయ, అంతర్జాతీయ విధానాలపై ప్రభావం చూపే పార్టీలవైపే మొగ్గు చూపుతారని, ఆ లెక్కన బీజేపీకి బలం పెరుగుతుందని స్థానిక బీజేపీ నాయకులు అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్‌తో ఎంతో కాలం పని చేసిన నందీశ్వర్‌గౌడ్ ఆ పార్టీని వీడి బీజేపీలో చేరారు. అలాగే టీడీపీతో ఉన్న ఎడ్లరమేష్ బీజేపీలో చేరి పార్టీ టికెట్‌ను ఆశిస్తున్నారు. మాజీ జెడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్ టీడీపీని వీడి బీజేపీలో చేరారు. ఇప్పుడు పటాన్‌చెరు టికెట్‌ను ఆశిస్తున్నవారు 11 మంది ఉన్నారు. వారిలో ముగ్గురి పేర్లను ఢిల్లీకి పంపించారని సమాచారం. వారిలో పారిశ్రామికవేత్త అంజిరెడ్డి కూడా ఉన్నారు. బీసీలకు ప్రాధాన్యం ఇస్తున్న బీజేపీ గెలుపు గుర్రాలను వెతుకుతోంది. అందుకు ప్రత్యేక సర్వేలను కూడా చేపట్టింది. ఆర్ఎస్ఎస్ ఇతర అనుబంధ సంస్థల ప్రతినిధుల సమాచారంపై ఆశావాహులకు టికెట్ లభించే అవకాశం ఉంది.

పెరిగిన ఓట్ల శాతం

గతంలో జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీకి వచ్చిన ఓట్లు కంటే 2018 సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల శాతం పెరిగింది. 2018 అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో పటాన్‌చెరు బీజేపీ అభ్యర్థి కరుణాకర్‌రెడ్డికి 7,428 ఓట్లు వచ్చాయి. 2020లో జీహెచ్ఎంసీ ఎన్నికల్లో భాగంగా పటాన్‌చెరులో 22,126, 2016 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 11,941 ఓట్లు పోలయ్యాయి.

ప్రగతి పనులే గెలుపునకు బాట

ఎమ్మెల్యే మాణిక్‌రావు



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన అర్జున్ నాయక్ తండావాసులు

జహీరాబాద్ టౌన్: బీఆర్ఎస్ గెలుపునకు ప్రగతి పనులే బాట వేస్తాయని, ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. మండలంలోని అర్జున్‌నాయక్ తండాకు చెందిన రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్, హరీశ్‌రావు సహకారంతో నియోజకవర్గం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. డీసీఎంఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ ఎం.శివకుమార్ మాట్లాడుతూ, కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు కూడా కచ్చితంగా విజయం సాధిస్తారని తెలిపారు. ప్రగతి పనులు కొనసాగింపు కోసం భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నారాయణ, ఆత్మకమిటీ చైర్మన్ పెంటారెడ్డి, ఇప్పెపల్లి సొసైటీ చైర్మన్ మచ్చేందర్, పార్టీ నాయకులు నారాయణ, వీరు రాథోడ్, గులాబ్ సింగ్ రాథోడ్ మధు, ఆకాష్, దేవుజి, జాటోత్ మచ్చేందర్, రాథోడ్ శివ జాటోత్, విక్రమ్, బీ శంకర్ రాయిపల్లి సర్పంచ్ విజయ్, మాజీ సర్పంచ్ వీరన్న పాటిల్ ఉన్నారు.

టికెట్ కోసం పోటాపోటీ

- జహీరాబాద్ బీజేపీ టికెట్ కోసం ముగ్గురు ఆశావహులు
- టికెట్‌పై ఎవరి ధీమా వారిదే..



ఢిల్లీవసంత్



రాంచందర్ రాజనర్సింహ



సుధీర్‌కుమార్

జహీరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో జహీరాబాద్ నియోజకవర్గం నుంచి ముగ్గురు బీజేపీ నేతలు టికెట్ కోసం పోటీపడుతున్నారు. పార్టీకి తగిన క్యాడర్, సంస్థాగత నిర్మాణం, ఓటు బ్యాంకు ఉండటంతో టికెట్‌ను దక్కించుకునేందుకు ఎవరికి వారే ప్రయత్నిస్తున్నారు. ఈ స్థానం ఎస్సీలకు రిజర్వు అయింది. రెండో విడతలోనే జహీరాబాద్ అభ్యర్థిని ఖరారుచేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గత ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసిన జంగం గోపి 20 వేల మేర ఓట్లను సాధించారు. పార్టీలో జరిగిన కొన్ని పరిణామాల వల్ల ఆయన దూరమయ్యారు. బీఆర్ఎస్ టికెట్‌ను ఆశించి భంగపడిన సామాజిక ఉద్యమకారుడు ఢిల్లీ వసంత్ ఇటీవల బీజేపీలో చేరారు. టికెట్‌ను దక్కించుకునేందుకు ఆయన గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దామోదర రాజనర్సింహ సోదరుడు రాంచందర్ రాజనర్సింహ ఎనిమిది నెలల క్రితం కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయన కూడా ఎమ్మెల్యే టికెట్‌ను ఆశిస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. పార్టీ ఇచ్చిన పలు కార్యక్రమాలను విజయవంతం చేసి తాను టికెట్ రేసులో ఉన్నట్లు అధిష్టానవర్గానికి సంకేతాలిచ్చారు. తన స్థాయిలో టికెట్ కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. కోహీర్ మండలం చింతలగట్టు గ్రామానికి చెందిన సుధీర్‌కుమార్ గత ఏడాది బీజేపీలో చేరారు. ఎమ్మెల్యే టికెట్‌ను ఆశిస్తూ పార్టీలో చేరుతున్నట్లు ప్రచారం చేసుకున్నారు. ప్రస్తుతం బీజేపీలో ఎమ్మెల్యే టికెట్ కోసం ముగ్గురు పోటీ పడుతున్నారు. అధిష్టానవర్గం ఎవరి వైపు మొగ్గు చూపుతుందో వేచి చూడాల్సిందే.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ జట్టు ఎంపిక



త్రోబాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

సిద్దిపేటజోన్: స్థానిక స్టేడియంలో అండర్ 19 ఉమ్మడి మెదక్ జిల్లా త్రోబాల్ జట్టును ఎంపిక చేశారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో బాల బాలికల విభాగంలో సెలెక్షన్లు నిర్వహించారు. ఎంపికైన వారు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి నాగేందర్, ఎస్జీఎఫ్ ప్రతినిధులు వెంకట్ స్వామి, ఉప్పలయ్య, ప్రవీణ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పేలిన గ్యాస్ సిలిండర్

- నలుగురికి గాయాలు
- కూలిన ఇంటి కప్పు



ప్రమాదంలో దెబ్బతిన్న ఇల్లు



వీరమణి

వెల్దుర్తి(తూప్రాన్): గ్యాస్ సిలిండర్ అమర్చే క్రమంలో ఒక్కసారిగా పేలుడు సంభవించగా.. నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. పేలుడు ధాటికి ఇంటిపై కప్పు కూలడంతో శిథిలాల కింద వృద్ధురాలు చిక్కుకుంది. ఈ ఘటన మండలంలోని ఉప్పులింగాపూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్ల వీరమణి కొంతకాలంగా ఒంటరిగా నివసిస్తోంది. గ్యాస్ సిలిండర్ ఖాళీ కావడంతో శుక్రవారం గ్రామంలోకి వచ్చిన ఏజెంట్ వద్ద సిలిండర్ తీసుకొని ఇంటి పక్కనే ఉన్న కుంట్ల పండరీని అమర్చడానికి పిలిచింది. అమర్చే క్రమంలో సిలిండర్ భారీ శబ్దంతో పేలింది. దీంతో పెంకుటిల్లు పైకప్పు కూలి, వీరమణి, పండరీతో పాటు ఇంటి బయట ఉన్న మంగళి వరలక్ష్మి, శ్యామలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ మదుసూధన్‌గౌడ్ అక్కడికి చేరి క్షతగాత్రులను తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గొంతులో చికెన్ ముక్క ఇరుక్కొని వ్యక్తి మృతి

శివ్వంపేట(నర్సాపూర్): మద్యం మత్తులో పచ్చి చికెన్ తినడంతో గొంతులో ఇరుక్కొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధి నవాబుపేట పంచాయతీ రాములు తండాలో గురువారం రాత్రి జరిగింది. పోలీసులు కథనం ప్రకారం .. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం కొత్తగూడం తండాకు చెందిన భీమ్లానాయక్(40) నాలుగు నెలల నుంచి రాములు తండాలోని అత్తగారి ఇంటి వద్ద ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. దసరా సెలవులు కావడంతో భీమ్లానాయక్ ఇద్దరు కూతుళ్లు గురువారం హాస్టల్ నుంచి తండాకు వచ్చారు. వారి కోసం తెచ్చి ఉంచిన మాంసాన్ని మద్యం మత్తులో ఉన్న భీమ్లానాయక్ తిన్నాడు. దీంతో చికెన్ ముక్కలు గొంతులో ఇరుక్కోవడంతో కుటుంబ సభ్యులు నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికాంత్‌రావ్ తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

గురుకుల పాఠశాలల సెక్రటరీ నవీన్



కబడ్డీ ఆడుతున్న గురుకుల విద్యార్థులు

మిరుదొడ్డి (దుబ్బాక): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల సెక్రటరీ నవీన్ నికోలస్ ఆకాంక్షించారు. మండల పరిధిలోని అల్వాల చెప్యాల క్రాస్‌రోడ్డులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో సిద్దిపేట, కామారెడ్డి జిల్లాలకు చెందిన 12 గురుకులాలకు చెందిన 1020 మంది విద్యార్థులకు నిర్వహించిన జోనల్ మీట్ ఉత్సవాలను జాయింట్ ఆయన సెక్రటరీ అనంత లక్ష్మితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీస్తూ వారిలో జోష్ నింపడానికి క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

మనస్తాపంతో చెరువులో దూకి..



సంపత్ (ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): మనస్తాపం చెందిన ఒక యువకుడు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిన్నశంకరంపేట మండలం సంగాయిపల్లిలో చోటుచేసుకుంది. సంగాయిపల్లి గ్రామానికి చెందిన సంపత్(20) అంబాజిపేట పెద్ద చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం ఇంటి నుంచి బైక్‌పై బయటకు వెళ్లాడు. కొంత సేపటికి తాను చెరువులో దూకి చనిపోతున్నానని నాన్నమ్మ దుర్గమ్మకు ఫోన్‌చేసి చెప్పాడు. వెంటనే ఆమె యువకుడి మేనమామలకు చెప్పడంతో వారు అక్కడకు చేరుకుని వెతకగా చెరువులో యువకుడి మృతదేహాన్ని గుర్తించారు. దుర్గమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణ తెలిపారు. నాలుగు రోజులుగా సంపత్ మనస్తాపంతో బాధపడుతున్నాడని చెప్పారు.

మనుమరాలి పుట్టిన రోజునే మృత్యువాత



హన్మంతు రాములు (ఫైల్)

పాపన్నపేట(మెదక్): మనవరాలు పుట్టిన రోజుకు వచ్చిన ఒక తాత రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన పాపన్నపేట శివారులో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది.. మిన్‌పూర్ గ్రామానికి చెందిన హన్మంతు రాములు(50) హైద్రాబాద్‌లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మనవరాలు పుట్టిన రోజు వేడుక కోసం రెండు రోజుల క్రితం మిన్‌పూర్‌కు వచ్చాడు. గ్రామానికి చెందిన జంగం కిషన్‌తో కలసి టీవీఎస్ మోపెడ్‌పై పాపన్నపేటకు వెళ్లి తిరిగి వస్తుండగా వాకింగ్ చేస్తున్న లక్ష్మణ్‌ను ఢీ కొట్టడంతో హన్మంతు, లక్ష్మణ్ గాయపడ్డారు. వారిని పాపన్నపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడి నుండి మెదక్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ హన్మంతు రాములు మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపారు.

బైక్ ఢీకొని..

వట్‌పల్లి(అందోల్): రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి మండల పరిధిలోని డాకూర్ గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. జోగిపేట ఎస్ఐ-2 మొగులయ్య తెలిపిన వివరాల ప్రకారం.. డాకూర్ గ్రామానికి చెందిన శంకరయ్య(40) తన ఇంటి నుంచి పొలానికి వెళ్తున్న క్రమంలో నాందేడ్-అకోలా 161 హైవే రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి...

పటాన్‌చెరు టౌన్: బైక్ ఢీ కొట్టిన ఘటనలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని కిష్టారెడ్డిపేట ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు వద్ద గురువారం సుల్తాన్‌పూర్‌కు చెందిన ప్రశాంత్ గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొట్టాడు. అతడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మందలించిందని..

నర్సాపూర్‌రూరల్: తన తల్లి మందలించిదని మనస్తాపానికి గురైన ఆర్టీసీ కండక్టర్ మృతి చెందిన ఘటన శుక్రవారం నర్సాపూర్‌లో వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా జోగిపేటకు చెందిన పుల్లబోయిన సాయితేజ(24) కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మద్యానికి బానిసై సక్రమంగా విధులకు హాజరుకాకపోవడంతో డిపో అధికారి సాయితేజ తల్లికి చెప్పారు. దీంతో ఆమె గత నెల 18న డిపోవద్దకు వెళ్లి మందలించింది. దీంతో పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోవడంతో అతడిని హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి సాయితేజ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నర్సాపూర్ పోలీసులు తెలిపారు.

బ్లూ క్రాఫ్ట్‌లో సీఐటీయూ గెలుపు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): బ్లూ క్రాఫ్ట్ అగ్రో పరిశ్రమ.. కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూ అభ్యర్థి బీరం మల్లేశం విజయం సాధించారు. శుక్రవారం మండల పరిధిలోని నందికంది శివారులో గల ఈ సంస్థలో జరిగాయి. సీఐటీయూ అభ్యర్థి బీరం మల్లేశం విజయం సాధించారు. మొత్తం 116 ఓట్లు ఉండగా 115 ఓట్లు పోలయ్యాయి. అందులో సీఐటీయూకు 58, బీఎంఎస్‌కు 57, ఒక కార్మికుడు ఓటింగ్‌లో పాల్గొన లేదు. కాగా బీఎంఎస్ పోటీదారుడిపై సీఐటీయూ అభ్యర్థి మల్లేశం ఓటు మెజార్టీతో విజయం సాధించారు. దీంతో కార్మికులు పరిశ్రమ ఎదుట టపాసులు కాల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. అనంతరం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్మికులకు ఎల్లపుడూ అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తానని మల్లేశం తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, నాయకులు ప్రవీణ్ కుమార్, సంతోష్, నర్సింలు, మల్లేష్, శ్రీనివాస్, వీరేశం, జోసెఫ్, జనార్ధన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నీట్-యూజీ సిలబస్ కుదింపు

నూతన సిలబస్‌ను విడుదల చేసిన ఎన్‌ఎంసీ

- విద్యార్థులపై భారం తగ్గించడమే లక్ష్యం
- కెమిస్ట్రీలో 20 శాతం సిలబస్ కట్...
- ఫిజిక్స్‌లో కష్టమైన కాన్సెప్ట్‌లూ తగ్గింపు

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు 2024 నుంచి నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) సిలబస్‌ను కుదించారు. విద్యార్థులపై భారం తగ్గించేందుకు జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సిలబస్‌లో స్వల్ప మార్పులు చేసింది. కెమిస్ట్రీలో అత్యధికంగా టాపిక్‌లు తగ్గించారు. మొత్తంగా కెమిస్ట్రీలో ఎక్కువగా 20 శాతం సిలబస్ తగ్గింది. దీనివల్ల విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ఫస్టియర్, సెకండియర్ కలిసి కెమిస్ట్రీలో అత్యధికంగా 9 టాపిక్‌లను తగ్గించారు. ఫిజిక్స్‌లో ఏ టాపిక్ తగ్గించలేదు, కానీ సబ్ టాపిక్స్‌లో కాన్సెప్ట్‌లను కుదించారు. విద్యార్థులు కష్టంగా ఫీలయ్యే సబ్ టాపిక్స్ కాన్సెప్ట్‌లను తీసేశారు. బోటనీ, జువాలజీల్లో మూడు చొప్పున టాపిక్‌లను తీసేశారు. అక్కడక్కడ కొన్ని కాన్సెప్ట్‌లకు కోత పెట్టారు. అన్ని సబ్జెక్టుల్లోనూ కొత్త కాన్సెప్ట్‌లను జోడించారు. ఇంటర్‌లో ప్రాక్టికల్స్‌లో ఉండే కాన్సెప్ట్‌లను ఇప్పుడు నీట్ పరీక్షలో పెట్టారు. ఆ ప్రకారం విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉంటుంది. కాగా, నీట్ యూజీ సిలబస్ తగ్గింపుతో ప్రస్తుత సెకండియర్ విద్యార్థుల కన్నా, ఫస్టియర్ విద్యార్థులకే అధిక ప్రయోజనం అంటున్నారు. నీట్‌ను 2024 మే 5న నిర్వహిస్తారు. ఇంకా నీట్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం కాలేదు.

తొలగించిన పాఠ్యాంశాలు

- **కెమిస్ట్రీ ఫస్టియర్:** పదార్థం స్థితి, హైడ్రోజన్, ఎస్ బ్లాక్ ఎలిమెంట్స్, ఎన్విరాన్‌మెంటల్ కెమిస్ట్రీ.
- **కెమిస్ట్రీ సెకండియర్:** ఘనస్థితి, ఉపరితల రసాయన శాస్త్రం, మెటలర్జీ, రోజువారీ జీవితంలో పాలిమర్లు, కెమిస్ట్రీ.
- **ఫిజిక్స్ ఫస్టియర్:** ప్యూర్ రోలింగ్, కనెక్టింగ్ బాడీలు, పాలిట్రోపిక్ ప్రక్రియ, బలవంతమైన, దెబ్బతిన్న డోలనాలు.
- **ఫిజిక్స్ సెకండియర్:** పొటెన్షియల్, నాన్ పొటెన్షియల్ సంభావ్యత, ప్రొటెన్షియో మీటర్, ఎర్త్ మ్యాగ్నటిజం, రేడియో యాక్టివిటీ, ట్రాన్సిస్టర్లు, ఆంప్లిఫయర్లు.

జువాలజీ యూనిట్-2: వానపాములు, యూనిట్-5లో శరీర నిర్మాణశాస్త్రం, జీర్ణక్రియ శోషణం, జ్ఞానేంద్రియాలు (చెవులు, కళ్లు), యూనిట్-10లో జీవావరణం, పర్యావరణం, పర్యావరణ సమస్యలు, పశుసంవర్ధకం.
బోటనీ ఫస్టియర్: ప్లాంట్ ఫిజియాలజీలో ట్రాన్స్‌పోర్ట్ ఇన్ ప్లాంట్స్, మినరల్ న్యూట్రిషన్, మార్ఫాలజీ.
బోటనీ సెకండియర్: స్ట్రాటజీస్ ఫర్ ఎన్‌హ్యాన్స్‌మెంట్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్.
బోటనీలో కొత్తగా చేర్చినవి: బయో మాలిక్యూల్స్, ఎంజైములు, ప్రాపర్టీలు, మాల్వేస్, లెగుమనీస్ సహా మరికొన్ని అంశాలు.

ముందే సిలబస్‌ను తగ్గిస్తే బాగుండేది

“సిలబస్ తగ్గింపు విషయాన్ని ఆలస్యంగా చెప్పడం వల్ల పిల్లలకు అంతగా ఊరట ఉండదు. ఇది ఎప్పుడో ముందే చెప్పాల్సింది. అలా చేసుంటే వాటిని చదవాల్సిన అవసరం ఉండేది కాదు. వాటిని ఇప్పటికే పిల్లలు చదివేశారు. అయితే రివిజన్‌లో చదవకుండా చూసుకోవాలి. ఏదిఏమైనా సిలబస్ తగ్గింపు పిల్లలకు ప్రయోజనం కలిగించేదే. – శంకర్‌రావు, డీన్, శ్రీచైతన్య కాలేజీ”

బోనాలపై భారీ చిత్రం

1,042 చదరపుటడుగుల కాన్వాస్‌పై చిత్రం



ఆత్మకూరు(ఎం): తెలంగాణ సంప్రదాయ పండుగల్లో ప్రధానమైన బోనాల పండుగకు విశ్వవ్యాప్త గుర్తింపు తీసుకొచ్చేందుకు భారీ చిత్రాన్ని వేశాడొక కళాకారుడు. బోనాల పండుగ విశిష్టతను తెలియజేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం కొరటికల్ గ్రామానికి చెందిన మహేశ్వరం నరహరి ఈ భారీ చిత్రాన్ని చిత్రించారు. ఇందుకోసం 15 కిలోల కారం, 15 కిలోల పసుపు ఉపయోగించారు. 1042 చదరపుటడుగుల కాన్వాస్‌పై చిత్రించేందుకు 10 గంటల 33 నిమిషాల సమయం తీసుకుందని ఆయన వివరించారు.

ఎయిర్‌పోర్టులో కావూరి కుమార్తె అరెస్ట్

- పాత కేసులో రాజస్తాన్ పోలీసుల లుక్అవుట్ నోటీస్
- ఓ భూయజమానిని ఆర్థికంగా మోసం చేశారని కేసు



శంషాబాద్: రాజస్తాన్ పోలీసుల లుక్‌ఔట్ నోటీసు మేరకు మాజీ ఎంపీ కావూరి సాంబశివరావు కుమార్తె శ్రీవాణిని శంషాబాద్ విమానాశ్రయంలో ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గురువారంరాత్రి ఎయిర్‌పోర్టు నుంచి దుబాయ్ వెళ్లేందుకు వచ్చిన శ్రీవాణిని అడ్డుకుని రాజస్తాన్ పోలీసులకు సమాచారం అందించారు. అప్పటివరకు ఆమెను ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. శుక్రవారం ఉదయం రాజస్తాన్ పోలీసులు వచ్చి కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించి రాజేంద్రనగర్ మెట్రోపాలిటన్ జడ్జి ముందు హాజరుపర్చారు. తమ స్థలంలో మట్టిని తవ్వి తరలించిన విషయంలో ఆర్థికంగా మోసం చేసినట్లు సంబంధిత భూ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైనట్లు సమాచారం. ఆ కేసులో విచారణకు ఆమె హాజరుకాకపోవడంతో అక్కడి పోలీసులు లుక్‌ఔట్ నోటీసులిచ్చారు. తాజాగా కోర్టు ముందు హాజరుపర్చిన అనంతరం ఆమెను రాజస్థాన్‌కు తరలించారు.

కొన ‘ఊపిరి’ నిలబెట్టారు!



రోహిత్‌తో వైద్యులు, వైద్య సిబ్బంది

- విజయవంతంగా రెండు ఊపిరితిత్తుల మార్పిడి
- పురుగుల మందు తాగిన యువకుడికి నిర్వహణ
- ప్రపంచంలో 4వ అరుదైన ట్రాన్స్‌ప్లాంట్
- యశోద ఆస్పత్రి ఘనత

రాంగోపాల్‌పేట్: విషం తాగి తీవ్ర ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన ఓ యువకుడికి యశోద ఆస్పత్రి వైద్యులు అరుదైన ఆపరేషన్‌తో ప్రాణం పోశారు. ఒకేసారి డబుల్ లంగ్స్ ట్రాన్స్‌ప్లాంట్‌ను విజయవంతంగా చేసి చరిత్ర సృష్టించారు. ప్రపంచంలో ఇలాంటి శస్త్ర చికిత్స నాలుగవది కావడం గమనార్హం. శుక్రవారం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు డాక్టర్ హరికిషన్‌లు వివరాలను వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా మర్రాయిగూడెంకు చెందిన 23 ఏళ్ల రోహిత్ గత నెలలో వ్యక్తిగత కారణాలతో పురుగుల మందు తాగి, ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లడంతో అతన్ని సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చేర్చారు. విషం ఊపిరితిత్తుల్లోకి వెళ్లి కోలుకోలేని పల్మనరీ ఫైబ్రోసిస్ పరిస్థితి ఏర్పడింది. అలాగే కిడ్నీలు, కాలేయం కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆయనకు మెకానికల్ వెంటిలేటర్స్ వైద్యం అందించిన తర్వాత 20 రోజులకు పైగానే ఎక్మోపై చికిత్స అందించారు. అయినా ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడలేదు. దీంతో రెండు ఊపిరితిత్తులను మారిస్తేనే యువకుడి ప్రాణాలు నిలబెట్టవచ్చని వైద్యులు భావించారు. కానీ భారతదేశంలో ఇలాంటి కేసుల్లో ఎక్మో వరకు వెళ్లి ప్రాణాలతో బయటపడిన వాళ్లు లేరు. శరీరంలో ఎటువంటి పురుగుల మందు అవశేషాలు లేవని నిర్ధారించుకున్నాక ఊపిరితిత్తుల మార్పిడి కోసం జీవన్‌దాన్‌లో నమోదు చేశారు. జీవన్‌దాన్ చొరవతో ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు డాక్టర్ హరికిషన్, థొరాసిక్ లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ కేఆర్ బాల సుబ్రహ్మణ్యం, డాక్టర్ మంజునాథ్ బాలే, డాక్టర్ చేతన్, డాక్టర్ శ్రీచరణ్, డాక్టర్ మిమి వర్గీస్‌లతో కూడిన బృందం ఆరు గంటల పాటు శ్రమించి విజయవంతంగా రెండు ఊపిరితిత్తులను మార్చారు. సంపూర్ణమైన ఆరోగ్యంతో రోహిత్‌ను డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు తెలిపారు.

అమ్మాయి జన్మిస్తే 111 మొక్కలు

- శ్యాంసుందర్ పలివాల్ వినూత్న కృషి..షార్ట్ ఫిల్మ్‌ను షేర్ చేసిన ఎంపీ సంతోష్ కుమార్

సాక్షి, హైదరాబాద్: ఆడబిడ్డ జన్మను పర్యావరణ పరిరక్షణకు ముడిపెడుతూ పద్మశ్రీ శ్యామ్ సుందర్ పలివాల్ చేస్తున్న కృషిని ఎంపీ జె.సంతోష్ కుమార్ అభినందించారు. దాదాపు ముప్పై ఏళ్లుగా రాజస్తాన్ బలోత్రా జిల్లాలో శ్యాంసుందర్ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఫాదర్ ఆఫ్ ఎకో ఫెమినిస్ట్‌గా పేరొందిన శ్యాంసుందర్ తన సొంత గ్రామం పిప్లాంత్రితోపాటు చుట్టుపక్కల ఎక్కడ ఆడపిల్ల పుట్టినా, ఆ అమ్మాయి పేరు మీదు నూటా పదకొండు మొక్కలు నాటడం, నాటించడం చేస్తున్నారు. పర్యావరణ క్షీణతతో ఎంతటి విపత్తును ఎదుర్కొంటున్నామో, ఆడబిడ్డల నిష్పత్తి పడిపోతే సమాజం అంతే ప్రమాదాన్ని ఎదుర్కొంటుందని ఆయన చెబుతుంటారు. సుందర్ పలివాల్ కృషిలో భాగస్వామ్యమైన ఆస్ట్రల్ ఫౌండేషన్, ఆయా గ్రామాల్లో నాటిన మొక్కల పరిరక్షణ కోసం 13 కిలోమీటర్ల పైపులైన్‌ను ఏర్పాటు చేసింది. హాస్పిటల్‌లో అమ్మాయి పుడితే ఊరు ఊరంతా తరలిరావటం, వేడుకగా మొక్కలు నాటే పండగను భావోద్వేగంగా చిత్రీకరించిన షార్ట్ ఫిల్మ్‌ను ఎక్స్(ట్విట్టర్)లో సంతోష్ కుమార్ షేర్ చేస్తూ పలివాల్ అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు.

విమలక్కకు ‘సుద్దాల’ పురస్కారం



విమలక్కను పురస్కారంతో సత్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి. చిత్రంలో ఆర్.నారాయణమూర్తి, సుద్దాల అశోక్‌తేజ, కోయి కోటేశ్వర్‌రావు, రచ్చ భారతి, ప్రొఫెసర్ కాశీం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం(హైదరాబాద్): ప్రజాగాయని, అరుణోదయ విమలక్కకు సుద్దాల హన్మంతు- జానకమ్మల జాతీయ పురస్కారాన్ని అందజేశారు. సుద్దాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారంరాత్రి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ ప్రజావాగ్గేయకారుడు సుద్దాల హన్మంతు పేరిట అవార్డు ప్రదానం చేయడం గొప్ప అదృష్టమన్నారు. ప్రజాకవిగా, కళాకారుడిగా అంతకుమించి క్రమశిక్షణ కలిగిన కమ్యూనిస్టుగా జీవితాంతం కష్టజీవుల కోసం, కమ్యూనిస్టు ఉద్యమం కోసం కృషి చేసిన హన్మంతు మహనీయుడని కొనియాడారు. ఆయన గొప్ప ప్రజావాగ్గేయకారుడని పేర్కొన్నారు. ప్రజానటుడు, సినీదర్శకుడు ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ కులోన్మాద, మతోన్మాద, రాజ్యోన్మాద శక్తులను ధిక్కరించడానికి, ప్రజలను మేలుకొల్పడానికి ప్రజావాగ్గేయకారుడుగా సుద్దాల హన్మంతు చేసిన కృషి మరువలేనిదన్నారు. తెలంగాణ పాటకు, ఆటకు జరుగుతున్న సత్కారమే విమలక్కకు అవార్డు అని పేర్కొన్నారు. అవార్డు గ్రహీత విమలక్క మాట్లాడుతూ సుద్దాల హన్మంతు పురస్కారం అందుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కోయి కోటేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుద్దాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్ కాశీం, ప్రముఖ రచయిత్రి ఐనంపూడి శ్రీలక్ష్మి, ‘మోదుగుపూలు’ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు, తెలంగాణ ప్రభుత్వ వాస్తు సలహాదారు సుద్దాల సుధాకర్‌తేజ, సుద్దాల హన్మంతు కూతురు రచ్చ భారతి, కుటుంబసభ్యులు సుద్దాల ప్రభాకర్, బల్లా కౌముది, సుద్దాల స్వప్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుద్దాల పుర ప్రముఖులు యాగమాటి జగన్మోహన్‌రెడ్డిని ప్రత్యేకంగా సన్మానించారు.

జిల్లా వార్తలు

రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

సిద్దిపేటజోన్: తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన అర్జున్ రామ్, మనివ్రత్ రెడ్డి, జగదీష్ రెడ్డి ఈ నెల 14 నుంచి 17 వరకు భువనగిరిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ సంపత్ తెలిపారు. ఎంపికైన వారిని రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యుడు సాయిరాం, జిల్లా డీవైఎస్ఓ నాగేందర్, సంతోష్ అభినందించారు.

రేపటి నుంచి అంతర్రాష్ట్ర భజన పోటీలు

జహీరాబాద్ టౌన్: శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఈనెల 15 నుంచి 21 వరకు అంతర్రాష్ట్ర భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శివకుమార్ పాటిల్, నామ రవికిరణ్ గుప్తా శుక్రవారం తెలిపారు. పట్టణంలోని భవనీ మందిరంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం పెద్ద ఎత్తున వాటిని నిర్వహిస్తుండగా తెలంగాణ, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల నుంచి భజన మండళ్ల పోటీల్లో పాల్గొంటున్నాయని వివరించారు. ఈ సంవత్సరం కూడా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేశామని తెలిపారు. సుమారుగా 18 వరకు భజన మండళ్లు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. ఈ నెల 21న ముఖ్యఅతిథిగా బెంగళూరుకు చెందిన గాయని కుమారి ప్రకృతి రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

మద్యం మత్తులో జారిపడి..



కిషన్ (ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్): తాగిన మైకంలో పొలంలో జారీ పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని సొమ్లా తండాలో గురువారం చోటు చేసుకుంది. శుక్రవారం ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం సొమ్లా తండాకు చెందిన కేతావత్ కిషన్(70) వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడిపేవాడు. గురువారం పని ముగించుకుని నీల్యా తండాకు వెళ్లాడు. ఇంటికి తిరిగి రాలేదు. ఉదయం రోడ్డు పక్కన ఉన్న పొలంలో కిషన్ పడి ఉండడం స్థానికులు గమనించారు. కల్లు తాగి వస్తున్న కిషన్ పొలంలో జారిపడి చనిపోయాడని కిషన్ కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

రూ.లక్ష విలువైన మద్యం స్వాధీనం

- రూ.4.43 లక్షల నగదు, వాహనం సీజ్
- 15 మందిపై కేసు,
- ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ ఎస్పీ శ్రీనివాస్



స్వాధీనం చేసుకున్న మద్యం, నగదుతో ఎక్సైజ్ అధికారులు

మునిపల్లి(అందోల్)/ సంగారెడ్డి: వాహనాల తనిఖీల్లో భాగంగా సుమారు రూ.లక్ష విలువైన మద్యం, రూ.4.43 లక్షల నగదు, ఒక వాహనాన్ని సీజ్ చేసి, 15 మందిపై కేసులు నమోదు చేశామని ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటిండెంట్ కె.శ్రీనివాస్‌రావు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో మీడియాకు వివరాలు తెలిపారు. ఎన్నికల్లో మద్యం రవాణాను అరికట్టేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ మెదక్ డివిజన్, సంగారెడ్డి జిల్లా టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు. కంకోల్ టోల్ ప్లాజా వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో భాగంగా టెంపోలో మద్యం రవాణా చేస్తున్న హైద్రాబాద్ గోషమాల్‌కు 13 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 45.7 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అలాగే కర్నాటక బస్సులో నగదును తీసుకెళ్తున్న మహిపాల్‌జైన్ నుంచి సుమారు రూ4.43 లక్షలు సీజ్ చేశామని, అలాగే రాజప్ప అనే మరో వ్యక్తి ఒక వాహనంలో రవాణా చేస్తున్న కర్నాటక మద్యం ప్యాకెట్లు, వాహనాన్ని స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేశామని శ్రీనివాస్ తెలిపారు. సమావేశంలో సీఐ హెచ్.మోహన్‌కుమార్, స్వాతి, ఎస్ రమేశ్‌రెడ్డి, జె.మధుబాబు, ఎస్ఐ అనిల్‌కుమార్, సీహెచ్. పృథ్వీరాజ్, విశ్వనాథ్, సిబ్బంది అలిమ్, సతీష్ మోహన్, అనిల్ కుమార్, శాంత, ప్రభాకర్, రమేశ్ పాల్గొన్నారు.

మద్యం పట్టివేత...

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆటోలో మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి మూడు కాటన్‌ల బీర్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మెదక్‌జిల్లా శంకరంపేటకు చెందిన ఇస్లావత్ దామోదర్ బీరు సీసాలను బెల్ట్ షాప్‌నకు ఆటోలో తరలిస్తుండగా స్థానిక డైమండ్ చౌరస్తా వద్ద పోలీసులు పట్టుకున్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- పదిన్నర క్వింటాళ్ల కాపర్‌వైర్ స్వాధీనం
- నిందితుల్లో ముగ్గురు జహీరాబాద్‌వాసులు
- బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి

బాన్సువాడ: ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్లను దొంగిలిస్తున్న నలుగురు సభ్యుల అంతర్రాష్ట్ర ముఠాను శుక్రవారం అరెస్ట్ చేశామని కామారెడ్డి జిల్లా బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.8.5 లక్షల విలువచేసే కాపర్‌వైరును స్వాధీనం చేసుకున్నామన్నారు. శనివారం ఆయన బాన్సువాడ డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. శనివారం నర్సింగ్‌పల్లి చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో సంగారెడ్డి వైపు నుంచి అనుమానాస్పదంగా వెళ్తున్న ఓమ్ని వ్యాన్‌ను ఆపేందుకు పోలీసులు యత్నించగా డ్రైవర్ వ్యాన్ ఆపకుండా వేగంగా వెళ్తుండడంతో నిజాంసాగర్ ఎస్ఐ రాజశేఖర్ తన సిబ్బందితో కలిసి వెంబడించి పట్టుకున్నారన్నారు. వ్యాన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన కాపర్‌వైర్లు ఉన్నాయన్నారు. వ్యాన్‌లో ఉన్న నలుగురు అనుమానాస్పదంగా కనిపించారని, వారిని విచారించగా నేరాన్ని అంగీకరించారని పేర్కొన్నారు. కామారెడ్డి, పిట్లం, మద్నూర్, భిక్కనూరు తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైర్లను దొంగలిస్తున్నట్లు అంగీకరించారన్నారు. అలా దొంగలించిన కాపర్‌వైర్లకు నాందేడ్‌లో విక్రయించడానికి వెళ్తుండగా పట్టుబడ్డారన్నారు. వారి వద్దనుంచి ఓమ్ని వ్యాన్‌తోపాటు 10.5 క్వింటాళ్ల కాపర్‌వైర్లను స్వాధీనం చేసుకున్నామని, వైరు విలువ రూ.8.5 లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. నిందితులు మహారాష్ట్రకు చెందిన రబ్బానీ ఉస్మాన్, జహీరాబాద్‌లోని శాంతినగర్‌కు చెందిన షాబుద్దీన్, జహీరాబాద్ మండలంలోని బైలాపూర్‌కు చెందిన మోల్లా ముక్తార్, జహీరాబాద్‌లోని భారత్‌నగర్‌కు చెందిన షేక్ కలీంలపై కేసులు నమోదు చేశామన్నారు. వారిపై 37 కేసులు ఉన్నాయని, మొత్తం 62 ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి వైర్లను దొంగిలించారని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం.. పరికరాల చోరీ



చోరీ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

శివ్వంపేట(నర్సాపూర్): గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్ ఫార్మార్లను ధ్వంసం చేసి అందులోని ఆయిల్, ఇతర పరికరాలను చోరీ చేసిన ఘటన మండల పరిధి శభాష్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. బాధిత రైతుల సమాచారం ప్రకారం.. తూప్రాన్- నర్సాపూర్ ప్రధాన రహదారి పక్కన ఉన్న రెండు 25 కేవీ ట్రాన్స్ ఫార్మర్లను ధ్వంసంచేసి బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆయిల్‌తో పాటు అందులోని విలువైన పరికరాలు అపహరించారు. విద్యుత్ నిలిచిపోయిన విషయం గుర్తించిన రైతులు గురువారం ట్రాన్స్‌ఫార్మార్ వద్దకు వెళ్లి పరిశీలించగా చోరీ విషయం గమనించారు. 16 మంది రైతులకు సంబంధించి బోరుబావులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఘటనా స్థలాన్ని శివ్వంపేట పోలీసులు పరిశీలించారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న పీఈటీ

దుబ్బాక: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ -17 వాలీబాల్ పోటీలకు దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు నరేష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. శివంపేట మండలం గోమారం ఉన్నత పాఠశాలలో జరిగిన జోనల్ స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన పదో తరగతి విద్యార్థినులు అక్షయ, నందిని, హర్షిణి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, వారు 18 నుంచి మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. హెచ్ఎం శ్రీనివాస్‌తో పాటు కౌన్సిలర్లు బాలకృష్ణ, స్వామి, కనకయ్య హర్షం వ్యక్తం చేశారు.

నర్మేట పాఠశాల నుంచి...

నంగునూరు(సిద్దిపేట): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు నర్మేట పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని పీఈటీ రాజ్‌కుమార్ తెలిపారు. అండర్ 19 విభాగంలో చేర్యాల వైష్ణవి, బందారం వర్ష , పిల్లి శిరీష, పిల్లి శివాణి అలాగే అండర్ 14 సిద్దిపేట జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు.

అండర్19 విభాగంలో..



సృజన్‌కుమార్

జగదేవ్‌పూర్ (గజ్వేల్): ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్19 విభాగంలో విద్యార్థి సృజన్ కుమార్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడని ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ సెల్వరాజ్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు.

క్రీడలతోనే ఆటగాళ్లకు గుర్తింపు

రాష్ట్ర ప్రత్యేక లీగల్ సెల్ అధికారి ప్రమీలా నాయక్



పోటీలను ప్రారంభిస్తున్న ప్రమీలా నాయక్

హత్నూర (సంగారెడ్డి): క్రీడలు దేహదారుఢ్యానికి ఎంతగానో దోహదపడతాయని సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ రాష్ట్ర ప్రత్యేక లీగల్ సెల్ అధికారిణి ప్రమీలా నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన హత్నూర గురుకుల పాఠశాల ఆవరణలో 9వ జోన్ లెవెల్ గురుకుల పాఠశాల క్రీడోత్సవాలను ప్రారంభించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించి దేశంలో గుర్తింపు పొందారన్నారు. మూడు రోజుల పాటు జరిగే పోటీలలో 11 పాఠశాలలకు చెందిన 960 మంది విద్యార్థులు పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో స్థానిక గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, వివేకానంద, వివిధ పాఠశాలలకు చెందిన పీఈటీలు, పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.